

మాకొద్దు నాయనో!

- నానో యూరియా, డీఏపీ లిక్విడ్లకు మొగ్గు చూపని రైతులు
- ధరలు తక్కువ, దిగుబడి ఎక్కువ.. అయినా ఆసక్తి చూపని వైనం
- జిల్లాలో అందుబాటులో 7,500 లీటర్లు
- కాంప్లెక్స్ ఎరువులపైనే అన్నదాతల మక్కువ
- సరైన అవగాహన లేకపోవడమే కారణం?



కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాపై రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. భూపాలపల్లి జిల్లాలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని అధికారులు అంటుండగా, క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొత్తగా వచ్చిన నానో యూరియా, డీఏపీపై రైతులు మక్కువ చూపడం లేదు. అవగాహనలేకనో, మరే కారణమో ఈ లిక్విడ్ల వినియోగానికి మొగ్గు చూపడం లేదు. కాంప్లెక్స్ యూరియా, డీఏపీనే వినియోగిస్తామని అత్యధిక మంది అంటున్నారు.

కాంప్లెక్స్ ఎరువులతో పోలిస్తే నానో ఎరువులు ధరలు అతి తక్కువ. మరోవైపు వీటి వినియోగంతో అధిక దిగుబడులు కూడా సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఒక బస్తా యూరియా ధర రూ.266 ఉంటే బయట దుకాణాల్లో సుమారు రూ.300 పైచిలుకే విక్రయిస్తున్నారు. నానో యూరియా 500 లీటర్ల డబ్బాకు రూ. 225 ధర ఉంటే రూ.200కే విక్రయిస్తున్నారు. డీఏపీ బస్తా కొత్త ధర రూ.1,400 ఉండగా నానో డీఏపీ రూ. 600 మాత్రమే లభ్యమవుతోంది. ఎకరాకు అర లీటరు నానో యూరియాను 200 లీటర్ల నీటిలో కలిపి వేస్తే సరిపోతుందని, లీటరు నానో డీఏపీని కూడా అంతే మోతాదులో వినియోగిస్తే పంటలకు మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నానో యూరియా 7,500 లీటర్లు, 15,500 బాటిళ్ల అందుబాటులో ఉన్నాయని అంటున్నారు.

అవగాహన లేకనేనా..?

నానో యూరియా, డీఏపీ పట్ల అవగాహన లేకనే రైతులు మక్కువ చూపడం లేదని తెలుస్తోంది. నానో యూరియా, డీఏపీ తయారు చేసే కంపెనీలు సైతం వాటి విక్రయాలకు వ్యాపారులకు అంటగడుతున్నారే తప్ప ప్రచారం చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో అక్కడక్కడ కార్యక్రమాలు నిర్వహించి రైతులకు నానో యూరియా, డీఏపీపై అంతంత మాత్రంగానే అవగాహన కల్పిస్తున్నారని తెలుస్తోంది. దీంతో రైతులు నానోపై అంతగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంప్లెక్స్ ఎరువులకు ప్రాధాన్యం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాగుకు సరిపడా యూరియా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కానిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 10 ప్రాథమిక సహకార సంఘాలు, 371 ఫెర్టిలైజర్ దుకణాలు ఉన్నాయి. వీటిల్లో ఖరీఫ్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 11,200 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశారు. ఇంకా జిల్లాలో అందుబాటులో 1088.136 మెట్రిక్ టన్నులను యూరియా ఉంది. మరోవైపు గత నెల 22న జిల్లాకు అదనంగా 5,500 మెట్రిక్ టన్నుల యరియా అవసరం ఉందని వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే విడుతల వారీగా ఈ యూరియా జిల్లాకు దిగుమతి అవుతుదని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు.

నానో యూరియాతో అనేక ప్రయోజనాలు

జాడి బాపురావు, వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి



నానో యూరియాతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ధర తక్కువ ఉండి.. అధిక దిగుబడి వస్తుంది. వీటిని వినియోగించాలని రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ మంగళవారం అన్ని రైతు వేదికల్లో నానో యూరియాపై శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ ఏవోలు, ఏఈవోలు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ రైతులు మొగ్గు చూపడం లేదు. కాంప్లెక్స్ ఎరువులు సైతం ఎలాంటి ఇబ్బంది లేదు. సాగుకు సరిపడా అన్ని మండలాల్లో అందుబాటులో ఉంది. అదనంగా మరో 5,500 మెట్రిక్ టన్నులకు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ప్రజా సమస్యలపై స్పందించాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ



ప్రజావాణిలో సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో దాఖలయ్యే వినతులపై అధికారులు సత్వరంగా స్పందించాలని, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 70 మంది వినతులు సమర్పించి, తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. వాటిపై అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే వినతులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పెండింగ్‌లో పెడితే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి వినతిపై జవాబుదారీ కలిగి ఉండాలన్నారు. అవసరమైన సమాచారం ప్రజలకు అందించడం, సమస్య పరిష్కారం దిశగా స్పష్టమైన రిపోర్టులు సమర్పించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేకూరాలి

ప్రజా దివస్‌లో ఎస్పీ కిరణ్‌ఖరే



బాధితుల సమస్యలను తెలుసుకుంటన్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాదివస్ కార్యక్రమం పట్ల పోలీసు అధికారులెవరూ అలసత్వం వహించొద్దని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. బాధితులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాదివస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎస్పీ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే పంపిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదివష్ ప్రధాన లక్ష్యమన్నారు. చట్టం పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి బాధితులకు భరోసా ఇవ్వాలని సూచించారు.

జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- బుగులోని జాతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బుగులోని జాతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పాండవుల గుట్టలు, కోటగుళ్లు, మైలారం గుహలు, గణపురంచెరువు, కోటంచ ఆలయం, బుగులోని వెంకన్న ఆలయాలను అభివృద్ధి చేసి భూపాలపల్లి జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో ఉన్న బుగులోని వెంకటేశ్వరస్వామి జాతర అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బుగులోని జాతర చైర్మన్ వెంకటస్వామి, అర్చకులు వెంకన్న స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బుగులోని జాతరకు రోడ్ల నిర్మాణం కోసం రూ. 5 కోట్ల 70 లక్షల నిధులను మంజూరు చేయగా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. జాతరలో రూ. కోటి 60 లక్షలతో కోనేరు, గుట్ట పైకి మెట్ల వెడల్పు చేస్తానని అన్నారు. త్వరలో మరో 2 కోట్లు దేవాదాయ శాఖ నుంచి మంజూరు చేయించి శివాలయం, కల్యాణ మండపం, భక్తులకు విశ్రాంతి గదులు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అటవీ, పర్యాటక శాఖ సహకారంతో వచ్చే జాతరలోగా పనులు పూర్తి చేస్తానన్నారు. విదేశాల్లో ఉన్నవారు దేవాలయాలు అభివృద్ధికి విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ నాయకులు కట్ల చిన్నిపటేల్, నిమ్మల విజేందర్, గంగుల రమణారెడ్డి, ఫున్నం రవి, పట్టెం శంకర్, పాతుపల్లి సంతోష్, ఆకుతోట తిరుపతి, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు నష్టం కలగకుండా చూడాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో చెరువులకు నష్టం కలగకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది భారీ వర్షాలకు జరిగిన నష్టాన్ని, కేంద్రం నుంచి నిధులు రాకపోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ సమస్యలను తక్షణమే కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. వర్షాలతో ఇబ్బందులు లేకుండా చూడాలని, చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కలెక్టర్లు నివేదిక సమర్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్‌నాయక్, వ్యవసాయశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి బాపురావు, ఉద్యాన శాఖ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



నర్సింహారావు మృతదేహం

వెంకటాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తగూడెం గ్రామానికి చెందిన అట్టం నర్సింహారావు(42) ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల సహాయంతో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం వరకు నర్సింహారావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వాగు వద్దకు వెళ్లి గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

6.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 6.36లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.10మీటర్లు నమోదైంది.

పెన్షన్ మా ప్రాథమిక హక్కు

- నినదించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ అనేది తమ ప్రాథమిక హక్కు అని ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నినదించారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం మధ్యాహ్నం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్, టీఆర్‌టీఎఫ్, టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, తిరుపతి, మధుసూదన్, రవీందర్, సేవానాయక్, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఆర్థిక, సామాజిక భద్రతకు పెన్షన్ ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కు అని 1980లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం తెచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. పాత పెన్షన్ స్కీంనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌లో ఉద్యోగుల నుంచి 10శాతం, ప్రభుత్వం నుంచి 10శాతం కలుపుతూ పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలమైన షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి వాటినే తమకు ఇవ్వాలని చూడటం దారుణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కుట్రపన్నినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు దానిని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరంపై అసత్యపు ప్రచారాలు

ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ములుగు టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్యపు ప్రచారాలు మానుకోవాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు వారిని (మిగతా 8వ పేజీలో)

ఆగస్టులో 73 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో భూపాలపల్లి ఏరియాలో 73 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 2.75 లక్షల టన్నులు కాగా 2.02 లక్షల టన్నులు సాధించామని తెలిపారు. బొగ్గు రవాణా లక్ష్యం 2.27 లక్షల టన్నులు కాగా 2.08 లక్షల టన్నుల రవాణా చేసి 75 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి ఏరియాలో నాలుగు భూగర్భ గనులు, రెండు ఓసీలు ఉండగా కేటీకే 5 ఇన్‌క్లైన్‌లో 24వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా ఇక్కడ 9,786 టన్నులు సాధించామని వివరించారు. ఓసీ-3లో 1,20,000 ఉత్పత్తి సాధించాల్సి ఉండగా 59,188 టన్నుల ఉత్పత్తి (58 శాతం) సాధించామని తెలిపారు. వచ్చే నెల ఏరియాకు 3.18 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి దీన్ని సాధించుకోవాలని కోరారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించి కార్మికులంతా తప్పక విధులు నిర్వర్తించాలన్నారు.



- పరవళ్లు తొక్కుతున్న బొగత

వాజేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కొండల పైనుంచి దుముకుతున్న జలధారలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జలపాతం అందాలను వీక్షించేందుకు పర్యాటకులు సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి సహజ సౌందర్యాన్ని కెమెరాల్లో బంధిస్తూ, సెల్ఫీలు దిగుతూ మైమరచిపోయారు.



గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో వసంతరావు



దర్బార్‌లో ఏపీవో వసంతరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమర్పిస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీవో) వసంతరావు అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏలో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 20 మంది గిరిజనులు తమ సమస్యలను ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరునాగారం, ములుగు, కన్నాయిగూడెం, గూడూరు, మంగపేట, మహబూబాబాద్, ఖానాపురం, తాడ్వాయి, గోవిందరావుపేట తదితర మండలాల నుంచి గిరిజనులు తరలి వచ్చి వినతులు సమర్పించారు. ముఖ్యంగా గిరివికాస పథకం, పోడుభూములకు పట్టాలు, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తదితర సమస్యలను గిరిజనులు పరిష్కరించాలని ఏపీవోను క కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్టీయూ నాయకుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల మాదిరిగానే ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాని ఎస్టీయూ ములుగు జిల్లా శాఖ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండలంలోని చల్వాయి జడ్పీహెచ్ఎస్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబరు 2004 తర్వాత నియమించబడిన ఉపాధ్యాయ, ఉద్యోగులందరిపై అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం పూర్తిగా అన్యాయం చేస్తోందన్నారు. ఇది జీవన భద్రతను కోల్పోయేలా చేస్తుందన్నారు. నూతన పెన్షన్ రద్దు చేసి, పాత విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్, నాయకులు శ్యాంసుందర్, రవీందర్, సుమన్, స్రవంతి, సులోచన, రజిత, పావని, లక్ష్మి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలో విద్యార్థిని ప్రతిభ

వాజేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఆదివారం జరిగిన జాతీయ జూనియర్ కబడ్డీ పోటీల్లో ములుగు జిల్లా వాజేడు మండలంలోని పెనుగోలు కాలనీకి చెందిన ఉయిక తరంగిణి ప్రతిభను చాటింది. బెస్ట్ రైడర్‌గా అవార్డు అందుకుంది. గత ఏడాది మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్ కూతురే తరంగిణి. ఖమ్మం జిల్లా పాలేరు నవోదయ పాఠశాలలో ఏడో తరగతి చదుతోంది. పెనుగోలు గుట్టల్లో నివాసం ఉండే రమేష్ కుటుంబం కొన్నేళ్ల క్రితం వాజేడు మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో ఉంటోంది. తండ్రి రమేష్ మరణించాక తల్లి రాంబాయి ప్రోత్సాహంతో తరంగిణి క్రీడల్లో రాణించడంపై స్థానికులు అభినందించారు.

ఆంధ్రజ్యోతి Classifieds

WANTED
★ Wanted Female Actors. Age : 18 to 25 Years & Professional Cameraman & DOP Contact : 8897361521
AJW-243142

WANTED HOSPITAL STAFF
★ Lab-Technicians, Pharmacy Sales, OT-Technicians, Insurance/Claims & Computer Operators with Experience in Hospital Feild. Cont : Guardian Hospital Wgl. 2 pm to 3 pm
AJW-549

WANTED TEACHER
★ Wanted Teacher to Teach LKG & హిందీ (I to V) Fluency in English @ క్రియేటివ్ స్కూల్, KOTHUR, HNK. Cell : 9293920935, 9182538110
AJW-7679

WANTED
★ లేడీస్ హాస్టల్‌లో వంట చేయడానికి వంట మాస్టర్ కావలెను. బిర్యాని వచ్చి ఉండాలి. హాస్టల్‌లో ఉండాలి మరియు మహిళ వర్కర్స్ కావలెను. వసతి భోజనం ఉచితం. అడ్రస్ : మమునూరు దగ్గరలో బొల్లికుంట. సంప్రదించండి: 9989323727
AJW-237492

WANTED
★ ప్రముఖ కంపెనీలో వరంగల్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సాలరి 15,000/- డెలవరి బాయ్స్ 10,000/- T.A.D.A సౌకర్యం కలదు. ఆసక్తికలవారు. సంప్రదించండి: 9390091439
AJW-6647

PLOT FOR SALE
★ కేవలం 500/- EMI తో 121 గజాల పండ్ల మొక్కలతో రిసార్ట్ ఫెసిలిటీతో పక్క డాక్యుమెంట్స్ గల ఫ్లాట్ మీ సొంతం చేసుకోండి. సంప్రదించండి: 9390111828, 9618372299
AJW-243416

FLATS FOR SALE
★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్ SPR స్కూల్‌కు దగ్గరలో Stilt plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సంప్రదించండి: 7660008666, 8309035091
AJW-27936

HOUSE FOR SALE
★ HNK Opp : KUC Police Station, రుద్రమదేవి కాలని, రోడ్ నెం.8, భీమారం 3/2 BHK Ready to Move, మూడు ఇండిపెండెంట్ ఇండ్లు, 160 Sqy, Rs.68 Lakhs కి అమ్మకానికి కలవు. సంప్రదించండి: 9118706786, 8074260608.
AJW-243067

TO-LET
★ TOLET 2-BHK Near Hanmakonda Mandal Office 8am-8pm Cell.No : 9390100118
AJW-243419

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

3+2 స్కీం కలదు

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273 9985411677
వరంగల్ 9949638376 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9949638376
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

కేసీఆర్‌ను బదనాం చేయడానికి కాంగ్రెస్ కుట్రలు



మహబూబాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బదనాం చేయడానికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని మునిసిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న తీరు, పీసీ ఘోష్ ఏకపక్ష నివేదికను వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నల్ల కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల్వాయి రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందించాలనే దృఢ సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే ఒక్క పిల్లర్ కుంగినందుకు ప్రాజెక్టు పనికి రాదని కాంగ్రెస్ సర్కార్ చిత్రీకరిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు కాళేశ్వరం అంశాన్ని ముందు పెట్టి కాలాన్ని గడుపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయం జోరుగా సాగుతున్న తరుణంలో రైతులకు సరిపడా యూరియాను అందించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న తరుణంలో బీఆర్ఎస్‌ను ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ విజయం తథ్యమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, గద్దె రవి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, తేళ్ల శ్రీనివాస్, జెరిపోతుల వెంకన్న, మార్నేని రఘు, పెద్ది వెంకన్న, జానీ, డౌలాగర్ శంకర్, గుగులోతు రాజు, బానోత్ రాము, సంతోష్, రాంబాబు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు

పెద్దవంగర(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జీవనధార కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, కాళేశ్వరం కమిషన్‌ను సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీలో తీసుకున్న బిల్లుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ సీబీఐకి అప్పగించడం కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు, చంద్రబాబు కనుసన్నల్లో నడుస్తుందని అర్థమవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలు తప్ప రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి లేదని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతి రైతును ఆదుకున్నామని, సబ్బండవర్గాలకు అండగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ రాగానే కరువు, యూరియా కష్టాలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే స్థానికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణంపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్య, పాకనాటి సునీల్‌రెడ్డి, శ్రీరాం సుధీర్, దుంపల సమ్మయ్య, చింతల భాస్కర్, వెంకట్రామయ్య, సల్టెండి సుధాకర్, హరీశ్, రాంమూర్తి, సుభాష్, భిక్షపతి, పూర్ణచందర్, అనిల్, మహేశ్, సతీష్, నవీన్, శేఖర్, రాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాత పెన్షన్‌ను అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎమ్డీ.రఫీ, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు సామ మాల్లారెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంకుల షరతులకు లోబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2004 సెప్టెంబరు నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ఉద్యోగుల కుటుంబాలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎ.మురళీకృష్ణ, యాకూబ్, బి.రమేష్, షైస శ్రీనివాస్, షైస నాగయ్య, కాగితపు వీరయ్య, వీరునాయక్, దేవేందర్‌రాజు, కిరణ్‌సింగ్, రోహిత్, ప్రసాద్, నాగముని, రమేష్, ఫిరోజ్, విజయ్‌కుమార్, లక్ష్మి, పి.మంజుల, సుభద్ర, రాజ్యలక్ష్మి, రమ్య, అమీనా, వివేక్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం భోజన విరామ సమయంలో పెన్షన్ విద్రోహ దినంను పురస్కరించుకొని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఒక అడుగుకూడా ముందుకు వేయలేదని ఆరోపించారు. హెచ్ఎం భద్రు, ఉపాధ్యాయులు మౌనిక, సూర్య ప్రకాష్, పవన్‌రాజ్, సూర్యతేజ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● పీఆర్టీయూ-టీఎస్ ఆధ్వర్యంలో సీపీఎస్ వ్యతిరేక హైదరాబాద్ మహా ధర్నాకు మద్దతుగా మహబూబాబాద్ మాజీ అధ్యక్షుడు సంకా భద్రినారాయణ నేతృత్వంలో వెళ్లారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో రామోజీనాయక్, సుజాత, వెంకటేష్, మోహన్, లక్ష్మారెడ్డి, విజయ్, సుశీల, హరిత, బాలు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

● ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఖాజా షరీఫ్ ●జనగామ కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఖాజాషరీఫ్ డిమాండ్ చేశారు. జీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 2004లో ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందును కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు కేంద్రాన్ని ఒప్పించి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులు నష్టపోతున్నారని, పదవీ విరమణ తర్వాత బెనిఫిట్స్ రావడం లేదని వాపోయారు. ఒక్కసారి ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీలకు జీవితాంతం పెన్షన్ ఇస్తుంటే, 35 ఏళ్లు పనిచేసిన ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేయడం తగదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ కోర్నేలియస్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షరీఫ్, నాయకులు రాంరెడ్డి, లక్ష్మీనారాయణ, పెండెల శ్రీనివాస్, పేర్వారం ప్రభాకర్, హఫీజ్, రాజనర్సయ్య, సంపత్‌కుమార్, రాంనర్సయ్య, ఉప్పలయ్య, స్టెల్లా, శ్రీధర్‌బాబు, నాగర్జున, విష్ణు, అరుణ, బాబు, మధు, శంకర్, రాజు, చందర్, రమేష్, టీజీవో అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం' నివేదికపై బీఆర్ఎస్‌వి సిగ్గులేని వ్యాఖ్యలు

● బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

● డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదిక తప్పుల తడక అంటూ బీఆర్ఎస్ నేతలు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ. 1.25 లక్షల కోట్ల అవినీతికి కేసీఆర్ కుటుంబం పాల్పడిందని ఆరోపించారు. రాత్రి ఎనిమిదో పెగ్గు వేశాక కాళేశ్వరం డిజైన్ చేశారని కేసీఆర్‌ను దుయ్యబట్టారు. కేసీఆర్ కుటుంబం దోచుకోవడంతోపాటు అధికారులను సైతం వారి అవినీతిలో భాగం చేశారన్నారు. ఘోష్ కమిటీ నివేదిక తప్పుల తడక అయితే కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడి నిజాయితీపరులుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కశాఖను కూడా వదలకుండా కేసీఆర్ కుటుంబం తెలంగాణను పీల్చి పిప్పి చేసిందని విమర్శించారు. కాళేశ్వరంతో పాటు బీఆర్ఎస్ హయాంలో అన్ని శాఖల్లో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని ఆయన కోరారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని కొమ్మూరి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై మండలిలో తీర్మానం చేసి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపించామన్నారు. పార్టీ తరఫున బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామన్నారు. కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో పీసీసీ జనరల్ సెక్రటరీలు ప్రభాకర్‌రెడ్డి, పీవీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు .

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు



మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ నేతలతో మాట్లాడుతున్న టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో రోజు రోజుకు పేరుకుపోతున్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మహబూబాబాద్ మండలం వేమూనూరు, కేసముద్రం మండలం బేరువాడలో వంద సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతుల భూములను అటవీ భూములుగా చిత్రీకరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రోడ్లు, సైడ్ డ్రైనేజీ కాల్వల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతులకు యూరియాను వెంటనే అందించాలన్నారు. అర్హులైన పేదలకు పీఎం అవాస్ యోజన పథకం కింద ఇళ్లను మంజూరీ చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలిచ్చి సమస్యను పరిష్కరించాలన్నారు. కాగా, తొలుత బీజేపీ శ్రేణులు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. మెయిన్ గేట్ నుంచి లోనికి వెళ్లి గ్రీవెన్స్ సెల్ హాల్ వరకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పది మందితో కూడిన బృందాన్ని లోనికి పంపించగా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందించి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, గడ్డం అశోక్, గాదె రాంబాబు, సత్యనారాయణ, చీకటి మహేష్, లింగాల సుధీర్‌రెడ్డి, శంకర్ నాయక్ మేరెడ్డి సురేందర్, చెల్పూరి వెంకన్న, గుగులోతు దేవిక, గుగులోతు మదన్, దారా ఇందుభారతి పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అధికారుల సమాయత్తం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో మండల ప్రాదేశిక నియోజకవర్గాలు(ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల(జడ్పీటీసీ) ఓటర్ల లిస్టు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలోని అధికారులు ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఈ నెల 6న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయం, జిల్లా స్థాయిలో జడ్పీ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 193 ఎంపీటీసీ స్థానాలు, 18 జడ్పీటీసీ స్థానాలుండగా, 1066 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అన్ని రాజకీయ పార్టీలతో మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయాలు, జిల్లాస్థాయిలో కలెక్టరేట్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు అభ్యంతరాల స్వీకరణ, 9న అభ్యంతరాల వినతులపై పరిష్కారం, 10న తుది ఓటర్ల లిస్టు, పోలింగ్ స్టేషన్ల జాబితాను ఆయా కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు.

కాంగ్రెస్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన



అమరవీరుల స్థూపానికి జలాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు భూపాలపల్లిలో సోమవారం నిరసనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశానుసారం అంబేద్కర్ కూడలిలో ఆందోళన చేపట్టి అమరవీరుల స్థూపానికి జలాభిషేకం చేశారు. అంబేద్కర్‌కు పూలమాలలు వేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇదే క్రమంలో జయశంకర్ విగ్రహం వద్ద యూత్ నాయకుల ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్ధు, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచాన్నే ఆకర్షించిందన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు అప్పటి సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మిస్తే కాంగ్రెస్ సర్కారు బురద జల్లే వ్యాఖ్యలు చేస్తూ పబ్బం గడుపుకుంటోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మాదాసు తిరుపతమ్మ, నాయకులు బీబీచారి, జక్కం రవికుమార్, మామిడి కుమార్, పోలవేణి అశోక్ యాదవ్, టీబీజీకేఎస్ నేత బడితెల సమ్మయ్య, యూత్ నాయకులు చిరంజీవి, యుగేంద్రాచారి, పోలవేణి మహేందర్, కోల్లోజు దిలీప్‌కుమార్, ఆకుదారి మనోహర్, దేవేందర్, జోరు రాజ్‌కుమార్, మహిళా నాయకురాలు దార పూలమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో సింగరేణిని కాపాడుకుందాం

- ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతో సింగరేణిని కాపాడుకుందామని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య అన్నారు. భూపాలపల్లిలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని విమర్శించారు. యూనియన్లకు అతీతంగా ఐక్య పోరాటాలతోనే సంస్థను కాపాడుకోవచ్చన్నారు. కేంద్రం త్వరలో 181 బొగ్గు బ్లాకులను వేలం వేయాలనే కుట్ర చేస్తోందని, అదే జరిగితే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, రాళ్లబండి బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7550	5300
మక్కలు	2216	1521
కందులు	5582	3022
పెసళ్లు	5550	3022
పల్లికాయ (సూక)	6200	3500
పల్లికాయ (పచ్చిది)	4260	2400
పసుపు (కాడి)	11066	7889
పసుపు (గోల)	10788	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15000	12000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	15000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)

మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.



ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఊ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది వడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- టీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే మున్ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే .ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

ఆయుష్ డిస్పెన్సరీల్లో

యోగా కేంద్రాలు

- 220 కేంద్రాల్లో 348 మంది యోగా శిక్షకుల నియామకం
- భూపాలపల్లిలో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి
- సమయపాలన పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు
- ఆయుష్ ఆర్‌డిడి డాక్టర్ బంటు ప్రమీలదేవి



వరంగల్ మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖ పరిధిలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు (ఆర్‌డిడి) డాక్టర్ బంటు ప్రమీల దేవి కోరారు. ఉమ్మడి జిల్లాలో ఆయుష్ వైద్య సేవల విస్తరణకు గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు విస్తృతమైన ఏర్పాట్లు జరిగాయని అన్నారు. ఆయుష్ ద్వారా తన పరిధిలోని 19 జిల్లాల్లో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో వైద్య సిబ్బంది, మందులు తదితర వివరాలను ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

సమయ పాలన

ఆయుష్ ఆసుపత్రుల్లో విధులు సరిగా నిర్వర్తించని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది విషయంలో కఠిన చర్యలు తీసుకుకోవడంతో పరిస్థితి చాలా వరకు మెరుగుపడిందన్నారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం) కింద పని చేస్తున్న డాక్టర్లు సిబ్బంది రోజుకు మూడు సార్లు ఉదయం 9, మధ్యాహ్నం 1, సాయంత్రం 4 గంటలకు తాము పని చేస్తున్న ప్రదేశం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా తమ ఫోటోలతో లోకేషన్ పంపాల్సి ఉంటుందన్నారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆసుపత్రుల్లో ఉండడమే కాకుండా వారు ప్రత్యేక ద్వారా ముఖ గుర్తింపు పెట్టాలన్నారు. విధులకు సరిగా రానివారికి వేతనాల్లో కోతపాటు సెలవులు కూడా రద్దు చేస్తున్నామని తెలిపారు. ఆయుష్ శాఖలో తన పరిధిలోని జిల్లాల్లో 827 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 690 మంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారని చెప్పారు.

ఆరోగ్య శిబిరాలు

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ ప్రమీలదేవి తెలిపారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా గ్రామాల్లో ఫీవర్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 358 వైద్య శిబిరాలను నిర్వహించినట్టు తెలిపారు. ఆయుష్‌లో సిబ్బంది కొరత ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయడానికి ఆశావర్కర్ల సహాయం కూడా తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 1030 మంది ఆశా వర్కర్లు ఆయుష్ సేవలను అందిస్తున్నారన్నారు. ఇందుకు గాను వీరికి నెలకు రూ. వెయ్యి గౌరవ వేతనంగా అందిస్తున్నామన్నారు.

50 పడకల ఆస్పత్రులు

రూ. 15 కోట్ల వ్యయంతో రెండు 50 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నట్టు డాక్టర్ ప్రమీలా దేవి వెల్లడించారు. ఇందులో ఒకటి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో, మరొకటి సిద్దిపేటలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భూపాలపల్లిలో ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయిందని, సిబ్బంది నియామకం త్వరలో పూర్తవుతుందన్నారు.

ఆయుర్వేదం, యునాని, హోమియో వైద్య సేవలు ఈ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

యోగా కేంద్రాలు

ప్రజల్లో యోగా పట్ల అవగాహన కలిగించడమే కాకుండా యోగాభ్యాసం పెంపొందించేందుకు ఆయుష్ డిస్పెన్సరీల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల నిర్వహణకు 420 మందికి గాను ఇప్పటికే 340 మందిని నియమించామన్నారు. యోగ శిక్షకులకు పురుషులకు నెలకు రూ. 8 వేలు, మహిళలకు రూ. 5 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ సెంటర్లలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పురుషులకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మహిళలకు యోగాలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

ఉద్యమానికి సజీవ సాక్ష్యం.. అమరధామం

- మరో జలియన్‌వాలాబాగ్‌గా పరకాల ఉదంతం
- ప్రతీ ఏటా సెప్టెంబర్ 2న నివాళులు
- నాటి పరకాల రక్తచరిత్రకు 78 ఏళ్లు



అమరధామంలో ఏర్పాటు చేసిన నాటి సమరయోధుల విగ్రహాలు



పరకాలలో నిర్మించిన అమరధామం

పరకాల సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రజాకారుల పాశవిక దాడికి పరకాలలో 15 మంది సమరయోధులు అమరులయ్యారు. ఈ ఉదంతం జరిగి నేటితో 78 ఏళ్లు పూర్తయ్యాయి. ఆనాటి తెలంగాణ స్వాతంత్రోద్యమ చరిత్ర వింటే ఒళ్లు గగ్గుర్పొడుస్తోంది. అక్షరజ్ఞానం తక్కువ ఉన్న నాటి రోజుల్లోనే ఉద్యమం ఉప్పెనలా ఎగిసిందంటే పరకాల ప్రాంతానికి ఎంత చరిత్ర ఉందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశం బ్రిటీష్ పాలన నుంచి విముక్తి చెంది ఆగస్టు 15న స్వేచ్ఛా స్వాతంత్ర్యం పొందినప్పటికీ నిజాం రాజు కబంధ హస్తాల్లో తెలంగాణకు విముక్తి లభించలేదు. స్వాతంత్ర్యం కోసం తెలంగాణ ప్రాంత ప్రజలు ఉద్యమం వైపు అడుగేశారు. ప్రజా సంఘాలు, సాయుధ పోరాటానికి సిద్ధమయ్యాయి. ఈ ఉద్యమానికి బెంబేలెత్తిన నిజాం సర్కారు.. ఖాసీం రజ్వీ రజాకారులను గ్రామాల పైకి ఉసిగొల్పింది. ఈ నేపథ్యంలో పరకాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని 1947 సెప్టెంబర్ 2న ఉద్యమకారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ కార్యక్రమానికి పరకాల ప్రాంతంలోని ప్రతీ గ్రామం నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. అప్పటికే పథకం ప్రకారం నిజాం సేనలు మాటు వేసి ఉన్నాయి. పట్టణంలోని తహసీల్ కార్యాలయం వరకు ప్రజలు చేరగానే రజాకారు మూకలు కత్తులు, బరిసెల, తల్వార్లతో ఉద్యమకారులను వెంబడించి ఊచకోత కోయగా నిజాం ఆధీనంలోని పోలీసులు తుపాకులతో విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 15 మంది అమరులవ్వగా వందలాదిమంది క్షతగాత్రులయ్యారు.

అమరధామంపై నిర్లక్ష్యం

ఉద్యమంలో ప్రాణాలర్పించి కొట్లాడిన ఉద్యమకారుల పేర్లు, వారి కృషి రోజురోజుకూ అంతరించి పోతోంది. ఆనాటి దృశ్యాలు, రక్తపు మరకలు నేటికి కూడా చెక్కు చెదరని రూపంలో అమరధామం చూస్తూ ఒళ్లు జలదరించే దృశ్యాలను కళాకారులు చిత్రీకరించారు. అయినా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అమరధామం రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటోంది. విగ్రహాల చేతులు ఊడిపోయి అమరధామంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

ఏడాదికొకసారి సెప్టెంబర్ 2ను పురస్కరించుకొని ఉద్యమకారులు అమరధామానికి చేరుకొని అమరవీరులకు నివాళులర్పించి వెళ్లిపోతున్నారు. ఒక పర్యాటక కేంద్రంగా జిల్లాలో కొనసాగే అమరధామం విలువలు లేకుండా పోయింది.

అమరుల స్మారకార్థం మందిరం

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల స్మారకార్థం పరకాలలో అమరవీరుల మైదానం ఏర్పాటు చేసి మందిరాన్ని నిర్మించారు. ఇప్పటికీ అక్కడ స్వాతంత్ర్య సమరయోధులు సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఇదిలా ఉండగా అమరవీరులు రక్తం ఒడిసిన ప్రాంతంలో అమరధామాన్ని నిర్మించారు. అప్పటి మహారాష్ట్ర, తమిళనాడు గవర్నరు చెన్నమనేని విద్యాసాగర్‌రావు నేతృత్వంలో అమరధామంను ఏర్పాటు చేశారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో వారి తల్లి చెన్నమనేని చంద్రమ్మ జ్ఞాపకార్థం 23 ఏళ్ల కిందట అమరధామాన్ని నిర్మించారు. రంగాపూరం సంఘటనకు సాక్ష్యంగా నిలిచే అమరుల చిత్రాలను అమరధామం చుట్టూ ఉద్యమకారుల విగ్రహాలను అబ్బురపరిచేలా ఏర్పాటు చేశారు. కాగా ప్రతీ ఏటా సెప్టెంబర్ 2న అమరధామం వద్ద స్వాతంత్ర్య సమరయోధులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అమరులకు నివాళులు అర్పిస్తుంటారు.

---

750 కిలోల గంజాయి పట్టివేత

పోలీసులు అదుపులో నలుగురు నిందితులు



చిలుకమ్మనగర్ శివారులో పోలీసు వాహనంలో తరలిస్తున్న పట్టుకున్న గంజాయి సంచులు

ఖానాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలుకమ్మనగర్ శివారు గువ్వల బోడు అటవీ ప్రాంతంలో అక్రమంగా డంప్ చేసిన 750 కిలోలకుపైగా ఎండు గంజాయిని సోమవారం పోలీసులు పక్కా సమాచారం మేరకు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఒడిశా నుంచి హైదరాబాద్‌కు టాటా ఏసీ వాహనంలో 23బస్తాలలో ఎండు గంజాయిని నలుగురు వ్యక్తులు తరలిస్తున్నారు. ఈ క్రమంలో భారీ వర్షం కురుస్తుండడంతో నిందితులు కొత్తగూడ చిలుకమ్మనగర్ బార్డర్‌లో గువ్వల బోడు సమీపంలోని అటవీ ప్రాంతంలో డంప్ చేసారు. వాహనాన్ని అక్కడి నుంచి తరలించి నలుగురు నిందితులు దూరం నుంచి కాపలా కాశారు. పక్కా సమాచారం అందుకున్న దుగ్గొండి సిఐ సాయి రమణ, స్థానిక ఎస్సై రఘుపతిలు సిబ్బందితో కలిసి వెళ్లి డంప్‌చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడే తూకం వేసి టాటాఏసీ, పోలీసు వాహనాలలో నర్సంపేటకు తరలించినట్లు సమాచారం. అదే విధంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, గంజాయి ఒడిశా రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా వస్తున్నట్లు మరో సమాచారం.

వరద సహాయక చర్యలు పకడ్బందీగా అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యలను అధికారులు పకడ్బందీగా అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం భారీ వర్షాలు, వరద సహాయంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాల యం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో భారీ వరదల కారణంగా దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, కుంటల వివరాలను సేకించాలని, వీటి మరమ్మతు, పునరుద్ధరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదల సహాయం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రాష్ట్రం వద్ద అందుబాటు లో ఉన్నాయని చెబుతున్నారని, గత వరదల సమయంలో వినియోగించిన నిధులను పూర్తిస్థాయిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద జమ చేసి కేంద్రం నుంచి మరింత సహాయం రాష్ట్రానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబరు నెలాఖరు వరకు నిధులు యూసీలను సమర్పించాలన్నారు. గతంలో వరదల సమయంలో పాడైన రోడ్ల మరమ్మతు పనులకు ఖర్చు చేసిన నిధులు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద నమోదు చేస్తూ వివరాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 2 నుంచి 6 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరద సహాయక చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 50 వినతులను స్వీకరించారు. ఇందులో గృహనిర్మాణ శాఖకు సంబం ధించిన 9, భూసమస్యలు 8, ఉపాధి కల్పనకు 5, పెన్షన్ 5, ఇతరశాఖలకు సంబంధించినవి 23 వినతులు ఉన్నాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల పరిధిలోని గ్రామాల అధికారులు, ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉధృతంగా పారుతున్న గోదావరి కారణంగా ఇప్పటికే మొదటి ప్రమాద



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

హెచ్చరిక జారీ చేసినట్టు తెలిపారు. ఈనెల 6 వరకు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. చెరువులు, కుంటల వద్దకు ప్రజలు పశువులను మేతకు తీసుకెళ్లవద్దని, చేపలవేటకు వెళ్లవద్దని, ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్టరాదని సూచించారు. ముఖ్యంగా జిల్లాలోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న ముందస్తు చర్యలకు సహకరిం చాలని కోరారు. వర్షాకాలం, వరదల దృష్ట్యా తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18004257109ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దివాకర, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరద సహాయక చర్యలను అధికారులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వరద నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. భారీ వరదల కారణంగా దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, కుంటల వివరాలు సేకరించాలని, వాటి మరమ్మతు, పునరుద్ధరణ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదల వల్ల మర మ్మతులకు గురైన పంచాయతీ రోడ్లు, రోడ్లు భవనాల శాఖ రోడ్ల డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద పునరుద్ధరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఇరిగేషన్ సీఈ కుమారస్వామి, ఎస్ఈ మోహన్‌రావు, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, డీపీవో దేవరాజ్, జిల్లా వ్యవ సాయ అధికారి సురేష్‌కు మార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మాణిక్యరావు, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి సల్మాన్‌రాజ్, ఫైర్ ఆఫీసర్ నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబశివ

ములుగు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందజేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ విమర్శించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో ఆయన కలెక్టర్ దివాకరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పంటలకు సరిపడా యూరియాను సరఫరా చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా పంటలకు సరిఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రత్నం రాజేందర్, జిల్లా నాయకులు రత్నం ప్రవీణ్, కొర్ర రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



శ్రీను (ఫైల్)

వాజేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పేరూరు ఆశ్రమ పాఠశాలలో 2022 నుంచి తెలుగు పండిట్ గ్రేడ్-2గా విధులు నిర్వర్తిస్తున్న ధర్మసోత్ శ్రీను(36) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు నెలలుగా హైదరాబాద్‌లో ఆయన చికిత్స పొందుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించి మృతిచెందారు. శ్రీను స్వస్థలం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం ఇమామ్‌నగర్. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆశ్రమ పాఠశాలు హెచ్‌ఎం భ ద్రాచలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

యూరియా కొరతపై డ్రామాలు : కాంగ్రెస్

గోవిందరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత ఉందని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు డ్రామాలాడుతూ పబ్బం గడుపుతున్నారని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా పేరు చెప్పుకుని దొంగ నాటకాలకు బీజేపీ, బీఆర్ఎస్‌లు తెరలేపాయని, యూరియా కొరతకు కేంద్రం కారణమైతే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాలకు యూరియాను సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వాజేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది.వెంకటాపురం మండలానికి చెందిన రైతు కోగిల కన్నయ్య తమ పశువులను మండలంలోని ప్రగళ్లపల్లిలో ఓ కాపరి వద్ద మేపుతున్నారు. ఈ క్రమంలో మురుమూరులో 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడటంతో అటుగా మేతకు వెళ్లిన ఆవు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఆవు విలువ రూ. 40వేలకు పైగా ఉంటుందని స్థానికులు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని జేఎల్‌ఎం వంశీ పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

వ్యాన్ బోల్తా.. రాకపోకలకు అంతరాయం

మంగపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణపల్లి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో సోమవారం ఉదయం మణుగూరు వైపు నుంచి వస్తున్న వ్యాన్ వేగంగా వచ్చి పల్టీ కొట్టింది. బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు నుంచి మేడారానికి పలువురు భక్తులు వెళ్తున్న క్రమంలో వాహనాన్ని డ్రైవర్ నడపడంతో అది అదుపు తప్పింది. పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గంటపాటు రోడ్డుపై వ్యాన్ అడ్డంగా పడటంతో ఇతర వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ములుగు టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌టీయూ ఉపాధ్యాయులు ములుగు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు ఎం.డి.హమీద్, సభ్యులు గైని సతీష్, ఉపాధ్యాయులు జి.రమేష్, కె.రాజేందర్, మల్లయ్య, జాఫర్ అలీ, చంద్రమౌళి, మదన్మోహన్, రజిత, పుష్ప, ఉమాదేవి, స్వాతి, సత్యం, పద్మజ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం నానాతంటాలు



యూరియా కోసం క్యూకట్టిన రైతులు

రేగొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు నానాతంటాలు పడ్డారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సోమవారం గంటల కొద్దీ క్యూ కట్టారు. యూరియా 285 బస్తాలు మాత్రమే రావడంతో రైతులకు అందరికీ అవి సరిపోలేదు. దీంతో వందలాది మంది రైతులు తిరిగి వెళ్లిపోయారు. స్టాక్ ఉంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదెకరాలు ఉన్న రైతుకు కూడా ఒక్క బస్తా మాత్రమే ఇస్తే ఎలా? ప్రశ్నించారు.

తేనెటీగల పెంపకం ఉచిత శిక్షణకు నిధులు

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియాలో తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమం నిర్వహణకు కేటీకే ఓసీ-2కు రూ. 24,95,500 సింగరేణి సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఓసీ-2 ప్రభావిత గ్రామమైన గడ్డిగానిపల్లి గ్రామంలో తెనెటీగల పెంపకం, శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింగరేణి ఏరియా వ్యాప్తంగా 3 ఏరియాలకు కేటాయించగా భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ-2 ప్రాజెక్టును ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ శిక్షణ ఒక వారం రోజుల పాటు ఉంటుందన్నారు. సుమారు వంద మంది మహిళలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. దీంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా కూడా చదువుకున్న వారికి 36 రకాల ఉచిత కోర్సులు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కవీంద్ర, ఏరియా ఎన్విరాన్మెంటల్ అధికారి టి. పోషమల్లు, ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

కళాకారుడికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న యుగేందర్

చిట్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కళాకారుడు జన్నె యుగేందర్ భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సినీ హాస్యనటుడు జనార్దన్‌రావు చేతుల మీదుగా యుగేందర్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. సామాజిక, చైతన్య నాటికలు, యూట్యూబ్, షార్ట్ వీడియోలలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న యుగేందర్‌కు ఈ అవార్డు దక్కింది. ఈకార్యక్రమంలో స్ఫూర్తి అకాడమీ వ్యవస్థాప చైర్మన్ ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో మొక్కలు నాటించండి

కలెక్టర్ రాహుల్‌శర్మకు చైర్‌పర్సన్ వినతి

కాటారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాటారం వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పండ్ల, పూల, నీడనిచ్చే మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మను ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన చైరపర్సన్ వినతిపత్రం అందించారు. 12ఎకరాల 9గుంటలు కలిగిన వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో రైతులకు ఉపయోగపడేలా ఈజీఎస్ ద్వారా మొక్కలు నాటడానికి అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ నాయకుడు చీమల రాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు పర్లపల్లి గ్రామస్థుల వినతి

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి గ్రామంలో డబుల్ రోడ్డు వెడల్పు తగ్గించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్లపల్లి గ్రామశివారు నుంచి టేకుమట్ల మండలం గుమ్మడవెల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం మంజూరైందని అన్నారు. కాగా, పర్లపల్లి గ్రామంలో రోడ్డు సెంటర్ నుంచి ఇరువక్కల 50ఫీట్లతో రోడ్డు వెడల్పుకు అధికారులు మార్కింగ్ పెట్టడంతో రోడ్డుకు సమీపంలో ఉన్న గృహాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీంతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడనున్నాయని తెలిపారు. రోడ్డు సెంటర్ నుంచి ఇరుపక్కల 36ఫీట్ల వరకు వెడల్పు చేస్తే ఎవరి ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం : ఎమ్మార్పీఎస్

టేకుమట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మాటలు కోటలు దాటుతున్నాయని గానీ చేతలు ఇంటిగడప దాటట్లేదు అన్నాట్టు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఉందని వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యేలు, మంత్రులు మాటలు చెబుతున్నారు తప్ప ఆచరణలో ఎక్కడ కనిపించడం లేదన్నారు. యూరియా కోసం రైతులు నాన ఇబ్బందులు పడుతుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చపెట్టి అసెంబ్లీలో సమయం వృథా చేయడమేటని ప్రశ్నించారు.

కాళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం వద్ద సోమవారం గోదావరి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి మహారాష్ట్ర వరద తగ్గడం, ప్రాణహిత నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో గోదావరి ప్రవాహ తీవ్రత తగ్గింది. కాళేశ్వరం వద్ద 9.6 మీటర్ల ఎత్తుతో సోమవారం ఉదయం నుంచి ప్రవహిస్తోంది.

అంతర్‌రాష్ట్ర రాకపోకలు యధాతథం

వాజేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరికి వరద తగ్గింది. మూడు రోజులుగా పెరిగిన ప్రవాహం ఆదివారం నుంచి తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. సోమవారం ఉదయం నుంచి వరద మరింత తగ్గడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నాలుగు రోజులుగా నిలిచిపోయిన అంతర్‌రాష్ట్ర రాకపోకలు సోమవారం ఉదయం నుంచి యదావిధిగా కొనసాగుతున్నాయి. టేకులగుడెం వద్ద రేకుమాగు వాగుకు వరద ఉధృతి తెలంగాణ-ఛత్తీసగఢ్‌కు రాకపోకలు నిలిచిపోయిన విషయం విదితమే. రాకపోకలు తిరిగి ప్రారంభం కావడంతో మూడు రోజుల నుంచి రహదారికి ఇరువైపుల నిలిచిన ప్రయాణికులు ప్రశాంతంగా తమ గమ్యస్థానాలకు బయల్దేరారు. మండలంలోని బొమ్మనపల్లికి వెళ్లే దారిపై మాత్రం వరద తొలగలేదు.

ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

మంగపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుపేట ఏరియాలో సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన రమణక్కపేట ఎస్సీకాలనీ, వెంకటగిరిపేట, సీఐఎస్‌ఐ చర్చి కాలనీల్లోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. రమణక్కపేట శివారులోని మల్లూరు గుట్ట నుంచి వర్షపు నీటితో పాటు మల్లూరు మధ్య తరహా ప్రాజెక్టు ఎడమ కాల్వకు ఉప కాల్వ పూర్తిగా పూడికుపోవడంతో అటువైపు వర్షపు నీరు తోడు కావడంతో ఇళ్లలోకి వరద చేరింది. బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై నుంచి వరద మోకాళ్లలోతుతో ప్రవహించింది. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో బి. భద్రు, ఎంపీవో పి.శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శి కోరేం రాజు ప్రభావితం ప్రాంతాలకు చేరుకొని గ్రామస్థుల సహకారంతో నీటిని బయటకు పంపించారు. ఇదే క్రమంలో జోరువానతో పాలాయిగూడెంలోని మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్ ఇంటి ప్రహరి వరద పోటుకు నేలమట్టమైంది.



రమణక్కపేటలో వర్షపునీరు

5 నుంచి భూనిర్వాసితుల దీక్షలు

మల్హర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల భూ నిర్వాసితులు ఈ నెల 5 నుంచి తాడిచర్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూ నిర్వాసితులు తాండ్ర మల్లేశ్, కేసారపు నరేష్ సోమవారం తెలిపారు. ఓసీపీల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, తమ ఇళ్లను సేకరించి పరిహారం చెల్లిం చి, సురక్షిత ప్రాంతానికి తరలించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు.

కాళేశ్వరంపై అసత్యపు ప్రచారాలు

(5వ పేజీ తరువాయి)

అడ్డుకున్నారు. ఈసందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ రైతుల కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్యపు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు వేములపల్లి భిక్షపతి, గరిగె రఘు, బైకాని సాగర్ యాదవ్, కోగిల మహేష్, మండల అధ్యక్షు డు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, మాజీ ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య, పోరిక విజయరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల తనిఖీ

కాటారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గురుకులాలను ప్రత్యేకాధికారులు సోమవారం తనిఖీ చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకులాన్ని తహసీల్దార్ నాగరాజు, గిరిజన సంక్షేమ బాలుర గురుకులాన్ని ఎంపీవో వీరస్వామి, గురుకులాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యల ను తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్స్ గట్టయ్య, రాజేందర్, జీపీ కార్యదర్శి సమీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

పెంట్‌హౌస్, సెల్లార్స్ సీజ్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనధికార పెంట్‌హౌస్, సెల్లార్లను సీజ్ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్మించిన సురక్ష ఆస్పత్రి భవనానికి అనుమతి తీసుకున్నదానికంటే అదనంగా నిర్మించిన పెంట్‌హౌస్‌ను, సెల్లార్‌ను హైకోర్టు ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా సరే అక్రమంగా నిర్మాణాలు చేపడితే 2019 మునిసిపల్ చట్టకం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంజూర్‌నగర్‌లో కూల్చివేసిన గేదెల షెడ్డును తామే కూల్చి వేశామని స్పష్టం చేశారు. దీనికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు. మంజూర్‌న గర్‌లోని ప్రాథమిక పాఠశాలకు రోడ్డు రావాలని, దీనికి అడ్డుగా గేదెల నిర్మాణం ఉందని, దీంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అప్పటి పాలకవర్గం అధికారంలో ఉన్న హయాంలోనే కూల్చివేయ డానికి, రోడ్డు నిర్మాణం చేయడానికి తీర్మానం చేసినట్టు తెలిపారు. తాము నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో ఎవరి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీపీవో సునీల్, ఏఈ మానస తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళా ఉత్సవ్



కళా ఉత్సవ్‌లో విద్యార్థిని నృత్యప్రదర్శన

కాటారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం కళా ఉత్సవ్-2025 మండల స్థాయి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ సమన్వయంతో నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల నుంచి ఎంపికైన విద్యార్థులకు చిత్రలేఖనం, శిల్పకళ, నృత్యం, సంగీతం, నాటకం, జానపద కళలు వంటి రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీదేవి, కాటారం, ధన్వాడ జడ్పీహెచ్ఎస్ హెచ్ ఎంలు సోమలింగం, సునీల్ హాజరు కాగా న్యాయ నిర్ణేతలుగా గౌరోజు సంతోష్, రామిళ్ల రాకేష్, పుల్లూరు నాగేశ్వర్‌రావు, రజనీకాంత్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు గండు రాజబాబు, బొల్లం సతీష్, రాజునాయక్, నరివెద్ది సత్యనారాయణ, ఎమ్మార్సీ సిబ్బంది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

డీఈకి ఈఈగా పదోన్నతి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఇరిగేషన్ డివిజన్-1 డీఈగా విధులు నిర్వర్తిస్తూ ఇన్‌చార్జీ ఈఈగా కొనసాగుతున్న బసవ ప్రసాద్‌కు పూర్తి స్థాయి పదోన్నతి లభించింది. ఈఈగా పదోన్నతి కల్పిస్తూ సోమవారం ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీ చేయగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ రాహుల్‌శర్మను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే గండ్ర సమీక్ష



మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. భూపాలపల్లి నియోజకవర్గంలోని అవసరమైన రోడ్లు, వంతెనలపై ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పలు అభివృద్ధి పనులు త్వరతగతిన చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న ఓ మహిళకు సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన పెద్దబోయిన తన్వి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఆపరేషన్ కోసం డబ్బులు అవ సరం రావడంతో వెంటనే సీఎంతో మాట్లాడి తక్షణ సహా యంగా రూ.2.50లక్షలు మంజూరు చేయించి అందజేశారు.

ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మల్హర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో తాడిచర్ల ఓసీపీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. పొలాలు, చెన్లలో వరద నీరు నిలిచిపోయింది. మానేరులో ప్రవాహ ఉధృతి పెరిగింది.

కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రిల్లో జర్నలిస్టు కుటుంబాలకు వైద్యం కోసం రాయితీ కల్పించాలని కలెక్టర్ రాహుల్‌శర్మకు జర్నలిస్టులు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా టీఎస్‌జేయూ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్స్ సెంటర్‌లో జర్నలిస్టులకు 50శాతం రాయితీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట గిరిజన రైతుల నిరసన

కృష్ణకాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసనకు దిగారు. 1956 లో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి 900 ఎకరాలు కేటాయించగా గిరిజనులు, హరిజనులు, బలహీన వర్గాల చెందినవారు సాగు చేసుకుంటున్నారన్నారు. అలాంటిది నిజామాబాద్ జిల్లాకు చెందిన సర్వేయర్ గ్రామాల్లోని రైతులకు తెలియకుండా బంధువుల పేర్ల మీద 600 ఎకరాలు పట్టాలు చేసుకున్నాడని ఆరోపించారు. ఆ పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు ముకులోత్ శ్రీనివాస్, వీక కిరణ్, ఐత బాపు, హట్కర్ తారాబాయి, కండెల సమ్మక్క, కిషన్ పాల్గొన్నారు

మండలంలో పుట్ట మధు పర్యటన

కాటారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మండలంలో సోమవారం పర్యటించారు. చిద్నెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త మంథెన రాములు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రాములు మృతదేహం వద్ద నివాళులర్పించారు. మధు వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, నాయకులు జక్కు రాకేష్, వూర వెంకటేశ్వర్‌రావు, రాజేంద్రచారి, టీవీ రమణ, ఎండీ మున్నా, బోడ తిరుపతి, మంథెన రమేష్, మహేష్, అంతర్గాం రమేష్, వెంకటేష్, కిష్టయ్య, రాజేందర్, చెన్నూరి అశోక్, మంథెన రాజు తదితరులు ఉన్నారు.

బొజ్జ గణపయ్యకు 61 రకాల ప్రసాదాలు



వెంకటాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రజకవాడలో ఏర్పాటుచేసిన మండపంలో బొజ్జ గణపయ్యకు ఆరవరోజు సోమవారం భక్తులు 61 రకాలతో తయారు చేసిన ప్రసాదాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యంగా సమర్పించారు. అదేవిధంగా పెరికవాడ, కనకదుర్గగుడి సెంటర్లలోని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం

ములుగు రూరల్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఐదు రోజులపాటు పూజలు అందుకున్న బొజ్జ గణపయ్యకు అటవీశాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. తోషకుంట చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664